# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 21 మే 2025


## సిరిసంపదలు నిచ్చే కల్పవల్లి మారెమ్మ తల్లి..

**సుండుపల్లె, మే 20, ప్రభాతవార్త :**

ప్రజలందరికీ సిరిసంపదలు కల్పించి, సుఖ సంతోషాలను ప్రసాదించాలని వైఎస్ఆర్సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మారెమ్మ తల్లిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మండల పరిధిలోని వానరాచపల్లె ఎగువ బిడికి గ్రామంలో వెలసిన మారెమ్మ తల్లి తిరుణాల మహోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్ఆర్సిపి ఎస్టి గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్ర నాయక్, మాజీ ఎంపీపీ అజంతమ్మ, మోహన్ రెడ్డి, బాబు రెడ్డి, రఘు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి ఐఎఫ్ఎస్ ఫలితాలలో ప్రతిభ



**ప్రొద్దుటూరు, మే 20, ప్రభాతవార్త :**

యూపీఎస్సీ సోమవారం విడుదల చేసిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో మండలంలోని గోపవరం పంచాయతీలోని శ్రీ వెంకటేశ్వర పశు వైద్య కళాశాల పశు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి చింతకాయల లవకుమార్ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఈ విషయమై ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడి గ్రామానికి చెందిన చింతకాయల లవకుమార్ వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి అని, పశువైద్య విద్యలో డిగ్రీ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్) 201116లో పూర్తి చేశారన్నారు. జంతు, అటవీ సంరక్షణలో మక్కువతో సాధన చేసిన ఆయన ఐఎఫ్ఎస్ రెండో ప్రయత్నంలో 49వ ర్యాంకు సాధించాడని వివరించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా ఉత్తమ ప్రతిభకనబరిచడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది లవ కుమార్ ను అభినందించారు.



కేబినెట్ సమావేశంలో మంత్రి మండిపల్లి



మంత్రులతో ముచ్చటస్తున్న రాంప్రసాద్

# పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**ప్రతిరోజు చెత్త సేకరణకు క్లాప్ మిత్రులు... దరిద్రంగా రాజంపేట ఆర్టీసీడిపోలో పారిశుధ్యం... జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మిక తనిఖీ**



రాజంపేట ఆర్టీసీ డిపోలో తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



కూచి వారి పల్లి చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాజంపేట అర్బన్, మే20 ప్రభాతవార్త**

పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. జనాభాకు అనుగుణంగా చెత్త సేకరణకు క్లాప్ మిత్రులను నియమించుకోవాలని సూచించారు. రాజంపేట ఆర్టీసీ డిపోలో మౌలిక సదుపాయాలు నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ రాజంపేట ఆర్టీసీ డిపోను కూచివారిపల్లె చెత్త సేకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు చోట్ల పారిశుధ్యం నిర్వహణ మూలిక సదుపాయాల గురించి అధికారులతో చర్చించారు.రాజంపేట ప్రధాన బస్టాండ్ నందు పారిశుధ్య నిర్వహణ మౌలిక వసతులు మెరుగుకు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధాన బస్టాండు నందలి పరిసరాలు, పారిశుధ్యం నిర్వహణ, బస్టాండ్ లో ఉన్న మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం, పార్సిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. బస్టాండ్ లో పారిశుద్ధం మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆర్టీసీ ఆర్ఎం ను కారణాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ కు ఏ ఏ ప్రాంతాల బస్సులు వస్తాయి, ప్రయాణికుల ఆక్యుపెన్సి ఎంత తదితర వివరాలను కూడా ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలను అడిగి తెలుసుకున్నారు.బస్టాండ్ లోపల, పరిసర ప్రాంతాలలో పారిశుద్ధాన్ని పక్కాగా నిర్వహించాలని ఆర్టీసీ ఆర్ఎం, మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. బస్టాండ్ లో పారిశుధ్యం, మౌలిక వసతులు మెరుగుపరచడానికి, అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు. ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలి...అనంతరం రాజంపేట మండలం కూచివారిపల్లె పంచాయతీ లోని చెత్త నుండి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో ఎన్ని హాబిటేషన్స్, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎంతమంది క్లాప్ మిత్రలు ఉన్నారు, రోజువారీ చెత్త సేకరణ చేస్తున్నారా, వారానికి ఎన్ని రోజులు చెత్త సేకరణకు వెళ్తున్నారు, ఎన్ని వాహనాలు ఉన్నాయి, సేకరించిన చెత్త సెగ్రిగేషన్ చేస్తున్నారా లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. పంచాయతీ పరిధిలో 12 హాబిటేషన్స్, దాదాపు 3800 హౌస్ హోల్డ్స్ ఉన్నాయని, 5 మంది క్లాప్ మిత్రలు రెండు రోజులకు ఒకసారి చెత్త సేకరణ చేస్తున్నట్లు పంచాయతీ సెక్రెటరీ కమలాదేవి కలెక్టర్కు వివరించారు. సేకరించిన చెత్తను ఎక్కడ ఉంచుతున్నారని కలెక్టర్ ప్రశ్నించగా, అక్కడికి కొద్ది దూరంలో ఉన్న డంపింగ్ యార్డ్ లో చెత్తను ఉంచి, అక్కడే సెగ్రిగేషన్ చేసుకొని తీసుకు వస్తున్నట్లు అధికారులు వివరించారు. 3800 కుటుంబాలు ఉంటే ఐదు మందితో చెత్త సేకరణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. క్లాప్ మిత్రల సంఖ్యను పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలి. అలాగే తడిపొడి చెత్త ను విడివిడిగా సేకరించాలని, ఈ విషయమై ప్రజలలో అవగాహన పెంచాలని సూచించారు. సేకరించిన చెత్తను తప్పనిసరిగా సెగ్రిగేషన్ చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కూచువారిపల్లిలో నివసిస్తున్న కాటుకూటి వెంకట రమణయ్య (70) ఇంటికి వెళ్లి, చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని, ప్రతి నెల ఒకటవ తేదీ పించను అందుతుందా, ఇంటి వద్దకే వచ్చి పించను ఇస్తున్నారా అన్న వివరాలను ఆరా తీశారు. వారానికి 3 రోజులు పాటు చెత్త తీసుకుని వెళ్తున్నారని, పింఛను ప్రతినెల 1వ తేదీన ఇంటికే వచ్చి ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. తడి పొడి చెత్తలను కలపకుండా విడిగా అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, తహసిల్దార్ పీర్ మున్ని, ఆర్టీసీ ఆర్ఎం రాము, రాజంపేట మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో కార్యాలయ ఏవో బాల మునిస్వామి, డిఎల్పిఓ, కూచివారిపల్లి సర్పంచి, వార్డు మెంబర్లు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## ధరలు లేక టమాటా రైతులు డామాల్

**పొలాల్లోనే వదిలేసిన టమాటాలు**

**మదనపల్లి మే 20 ప్రభాతవార్త**



పొలాల్లో వదిలేసిన టమాటా పంట.

టమాటోకు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు టమాటాను పొలాల్లోనే వదిలేస్తున్నారు. మంగళవారం టమాట మార్కెట్ యార్డ్ లో కిలో టమాట ఆరు రూపాయల నుంచి ఏడు రూపాయలు వరకు ధరలు పలికింది. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టాలు చవి చూస్తున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి సాగు చేసిన టమాటో కు గత నెల రోజులుగా ధరలు లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని పలువురు చెప్తున్నారు. ప్రభుత్వం టమోటా రైతులకు ఆదుకోవాలని ప్రజా సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి కనీస గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు కోరుతున్నారు. టమాటా వ్యాపార లావాదేవులకు మదనపల్లి మార్కెట్ యార్డ్ రాష్ట్రంలోనే పేరు పొందింది. ఇక్కడి నుంచి టమాటాలు మహారాష్ట్ర మధ్యప్రదేశ్ కేరళ తమిళనాడు ఒరిస్సా తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతాయి. బయట ప్రాంతాల్లో టమాటో కు డిమాండ్ లేకపోవడం వల్లే ధరలు పతన దశకు చేరాయని వ్యాపారస్తులు చెబుతున్నారు . ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లి రెవెన్యూ డివిజన్లో టమాటాను రైతులు జీవనాధార పంటగా సాగు చేస్తారు. ఏడాది పొడవునా టమాటా ఈ ప్రాంతంలో సాగు అవుతూనే ఉంటుంది. టమాటో గిట్టుబాటు ధరలకు సంబంధించి ప్రభుత్వం స్పందించాల్సి ఉందని రైతులు కోరుతున్నారు.

# అభివృద్ధికి చిరునామా తెలుగుదేశం పార్టీ

**ప్రొద్దుటూరు మే 20 ప్రభాతవార్త**

రాష్ట్రంలో అన్ని రంగాలలో అభివృద్ధికి చిరునామా తెలుగుదేశం పార్టీ అని ఎలాంటి అభివృద్ధి అయినా చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని భారత కల్యాణ మండపంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహానాడు సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కళా సార్వభౌమ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా గత 43 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు అందులో భాగంగా ఈనెల 27 28 29 తేదీలలో కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి ముందుగా ప్రతి నియోజకవర్గంలో మినీ మహానాడు నిర్వహించాలన్న పార్టీ అధిష్టాన నిర్ణయంతో ప్రొద్దుటూరులో మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశం కడపలో జరిగే మహానాడు కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధికై చేసిన తీర్మానాలను ప్రవేశపెట్టి పార్టీ అధిష్టానానికి తెలపడమే అన్నారు. అంతే కాకుండా కడపలో జరిగే మహానాడు బహిరంగ సభకు ఏర్పాట్ల పరిశీలనపై చర్చించుకోవడం సభ ముఖ్య ఉద్దేశం అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఇప్పటికే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 75 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. రోడ్లు భవనాల శాఖలో 25 నుండి 30 కోట్లు పంచాయతీరాజ్ శాఖలో 45 కోట్లు మహానాడులో పనులు జరుగుతున్నట్లు తెలిపారు భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు 13 అంశాలను పొందుపరుస్తూ సభ తీర్మానం చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వ అరాచకాలకు అవినీతికి విసిగి వేసారిన ప్రజలు రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని, ప్రొద్దుటూరులో తనకు 20 వేల మెజారిటీ ఇచ్చి ఘన విజయాన్ని అందించిన ప్రొద్దుటూరు ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. నా ఊపిరి ఉన్నంతవరకు ప్రజల సేవలోనే నీతి నిజాయితీగా బ్రతుకుతూ ప్రజలకు సేవలు చేస్తానని ఉద్వేగ భరితంగా పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా కడపలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న మహానాడుకు ప్రొద్దుటూరు నియోజకవర్గం నుండి అశేషంగా తరలివచ్చి తనకు ఖ్యాతిని తెచ్చి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఒకే ఒక్క పిలుపుతో ప్రొద్దుటూరు మహానాడుకు అశేష జనవాహిని తరలి రావడం తనకెంతో సంతోషకరంగా ఉందన్నారు. మహానాడు సభను ఉద్దేశించి జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి మరియు మహానాడు పరిశీలకులు ప్రభాకర్ చౌదరి ప్రశంసించడం మరింత ఆనందాన్ని ఇచ్చిందన్నారు నేటిలాగా కడపలో జరగబోయే మహానాడుకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.



**ప్రొద్దుటూరు అభివృద్ధికి పెద్దాయనకు ఎల్లవేళల సహకరిస్తా.. జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి**

ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధికి ఎల్లవేళలా పెద్దాయనకు సహకరిస్తానని టిడిపి జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసులు రెడ్డి హామీ ఇచ్చారు ప్రొద్దుటూరులో నిర్వహించిన మహానాడు లో ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే మహానాడు ను కడపలో నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో జరిగిన మహానాడు కార్యక్రమాల్లో అన్నిటికంటే మిన్నగా కడపలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మహానాడు కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి లక్షలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 25 ఏళ్ల అనంతరం ఉమ్మడి కడప జిల్లాలో పదికి ఏడు సీట్లు సాధించడం గొప్ప విషయం అన్నారు. ఈ విజయానికి దోహదపడిన ప్రతి కార్యకర్తను గుర్తించి సముచిత స్థానం కల్పించాలని ఇప్పటికే అధ్యక్షులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహానాడు పరిశీలకుడుగా అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పట్టణ టిడిపి అధ్యక్షులు ఇవి సుధాకర్ రెడ్డి టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ నాయుడు వి ఎస్ ముక్తియార్ సర్పంచ్ శివ చంద్రారెడ్డి టిడిపి నాయకులు పగిడాల దస్తగిరి రిటైర్డ్ ఎస్సై శివశంకర్ మరియు టిడిపి కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం

**టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్ రాజు**




**రాజంపేట అర్బన్, మే20 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు అన్నారు. జాబ్ మేళా తో నిరుద్యోగ యువత కు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా ను ఆయన ప్రారంభించారు. ఉద్యోగం యువతకు ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం లభించడం సాధ్యం కాదని, అందుకే కూటమి ప్రభుత్వం తరుపున జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో అనేకమంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు, అలాగే స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కూటమి ప్రభుత్వంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోబోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇలా స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ,టిడిపి ముఖ్య నాయకులు, రాజంపేట పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్, పలు కంపెనీల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

# జమ్మలమడుగులో దద్దరిల్లిన మినీ మహానాడు

**జమ్మలమడుగు, మే 20, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డు నానుబాల ఎల్లప్ప ఫంక్షన్ హాల్లో జమ్మలమడుగు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గ ఇన్ఛార్జి చదిపిరాళ్ల భూపేష్రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26, 27, 28 తేదీల్లో కడపలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో మన రాయలసీమ కడప జిల్లాలో మహానాడు నిర్వహించడం మన అందరికీ సంతోషకరమైన విషయం ఈ మహానాడు ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి ఆ తీర్మానాన్ని పార్టీ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్య ఉద్దేశమన్నారు. 1982లో తెదేపా స్థాపించి అతి తక్కువ సమయంలోనే అధికారంలోకి తెచ్చిన ఘనత దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ అని ఆయన చెప్పిన మాటల్లో ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయం అనే స్ఫూర్తితో పార్టీ ముందుకెళ్తుందని మన జిల్లాలో జరిగే మహానాడు కార్యక్రమానికి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఈ జనాలను చూసి కడప నడిబొడ్డులో తెదేపా సత్తా ఏంటో నిరూపించాలన్నారు. ఆ వేలాది మంది కార్యకర్తలను చూసి జగన్ వెన్నులో వణుకు పుట్టాలని వారు పేర్కొన్నారు. అందులో భాగంగా కడప స్టీల్ప్లాంట్లు 3 సంవత్సరాలలో పూర్తి చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మహానాడు తీర్మానం చేస్తామని దీనికి సీఎం చంద్రబాబునాయుడు తీర్మానం చేస్తామని దీనికి సీఎం చంద్రబాబునాయుడు కూడా సంకేతం ఇచ్చారన్నారు. ప్రతిపక్ష పార్టీలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని విష ప్రచారం చేస్తున్నారని దేశంలోనే అత్యధికంగా 4వేలు పంఛను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఏపీ అని ఇది ప్రతిపక్షాలు గుర్తుంచుకోవాలని త్వరలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయని శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం ఇన్ఛార్జి భూపేష్రెడ్డి మినీ వమానాడులో కొన్ని తీర్మాణాలను శ్రీనివాసరెడ్డికి పంపించారు.





## తాగునీటి బోరు మరమ్మతులపై ఇరువర్గాలు ఘర్షణ...

**ముద్దనూరు, మే20, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చిన్నదుద్యాల గ్రామ పంచాయతీ త్రాగునీటి బోరు మరమ్మతులు గురవడంతో రిపేరు చేయి విషయమై ఇరు వర్గాలవారు ఘర్షణ పడినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం బిజెపి పార్టీకి చెందిన భూమి రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి మంగళవారం బోరును మరమ్మత్తులు నిర్వహిస్తుండగా వైసిపి పార్టీ గ్రామ సర్పంచ్ భర్త బోరెడ్డి మదన్మోహన్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, ప్రసాద్ రెడ్డిలు గ్రామ సర్పంచ్ ఉండగా మీరు మరమ్మత్తులు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్న సమయంలో ఇరు వర్గాల వారు మాట మాట పెరిగి బిజెపి వ్యక్తులపై మచ్చు కత్తితో దాడి చేయడంతో వైసిపి వర్గానికి చెందిన వారిపై అత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు.





# జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాలి



రాయచోటి అర్బన్, మే 20 ప్రభాత వార్త

జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను తప్పనిసరిగా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో... దేవాలయ భూముల పరిరక్షణపై జిల్లాస్థాయి భూ సంరక్షణ కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో మొత్తంగా 9761 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురి అయి ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణ లో గుర్తించిన 1167.52 ఎకరాల భూములలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటనే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తంగా మొత్తంగా ఉన్న 9761 ఎకరాలకు గాను గత సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన సమావేశం నాటికి 4866 ఎకరాల భూములు 1బి అడంగల్ నందు దేవాలయ పేర్లు నమోదు కావడం జరిగింది. ప్రస్తుతం 5500 ఎకరాలకు సంబంధించి వన్ బి లో పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకను దాదాపు 2200 పైబడిన భూములకు వెంటనే వన్ బి అడంగల్ నందు సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని దేవాలయాలలో పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని, క్యూలైన్ మేనేజ్మెంట్ తప్పని సరిగా చేయాలని సూచించారు. కొన్నిచోట్ల దేవాలయ భూములను తక్కువ ధరకు వేలంలో లీజుకి ఇస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. సరైన ధరకు వేలం నిర్వహించి భూములను లీజుకు ఇవ్వాలని ఈవో లను ఆదేశించారు. వివాదాస్పద భూములన్నింటిని సర్వే చెయ్యాలని సూచించారు. జాయింట్ సర్వే పెండింగ్ ఉన్న వాటిని ఆయా శాఖలు సమన్వయంతో 30 రోజులు లోపల పూర్తి చేయాలన్నారు. వన్ బి అడంగల్ పేరు మార్పులను 45 రోజులు లోపల చేయాలని రెవిన్యూ శాఖకు సూచించారు. ఆలయానికి ఆదాయం పెంచాలని, ప్రతి దేవాలయం భూమిని వేలంలో లీజుకు ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వారి పరిధిలోని ఆలయాలను సందర్శించాలని సబ్ కలెక్టర్లను మరియు తాసిల్దారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ అధికారి సి విశ్వనాథ్ మాట్లాడుతూ... జిల్లాలో ఆలయాలకు చెందిన 5700 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని.. వాటిని గుర్తించాల్సి ఉందన్నారు. భూములను గుర్తించిన పిదప వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయ ఆర్థిక స్థితి మెరుగు పడుతుందని కలెక్టర్ కు వివరించారు. ఈ విషయంలో దేవాదాయ శాఖ, రెవిన్యూ, సర్వే, మునిసిపల్, పంచాయతీ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి భూములను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, టెంపుల్ ఈవోలు, తనిఖీదారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

బద్వేలు అర్బన్, మే 20, ప్రభాత వార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు)పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డిఒ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ స్వతంత్రానికి పూర్వం పూర్వం బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఆప్కాస్ సంస్థను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను విడనాడాలని, తదితర డిమాండ్లు చేశారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో జూలై 9 వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, శివకుమార్,హరి, మున్సిపల్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సత్యరాజు, దేవమ్మ, రామయ్య, నారాయణ పాల్గొన్నారు.

## ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ దారుణం



పులివెందుల,మే20,ప్రభాత వార్త:

రాజకీయ దురుద్దేశంతో కక్ష సాధింపుగా ఓఎస్డి కృష్ణమోహన్ రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమని, అవినీతి మచ్చలేని అధికారి కృష్ణమోహన్ రెడ్డిని వైకాపా నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్షపూరిత అక్రమ అరెస్ట్ లపై మంగళవారం పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ ఇంచార్జ్ అధికారి రెడ్డి లక్ష్మికి వైసిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ దురుద్దేశంతోనే గత ప్రభుత్వంలో పనిచేసిన ఉన్నతాధికారుల పై అక్రమ కేసులు నమోదు చేసి జైలు కు పంపించడం జరుగుతోంది అని, కృష్ణమోహన్ రెడ్డి దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పాడా సంస్థ ప్రత్యేక అధికారి గా విధులు నిర్వహిస్తూ పులివెందుల ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన అధికారి అని పులివెందులలోని ప్రజలతో మమేకమవుతూ ఈ ప్రాంతానికి సుపరిచిత వ్యక్తి గా, ఎటువంటి అవినీతి ఆరోపణ లేకుండా మంచి ప్రభుత్వ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారనీ గత 20 ఏళ్లుగా పులివెందుల ప్రాంత ప్రజలకు, ప్రాంతానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సేవ చేస్తున్న వ్యక్తి అని అన్నారు. ఇటువంటి ప్రభుత్వ అధికారి పై, మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి మీద కేవలం రాజకీయ కక్ష సాధింపు లో భాగంగా అక్రమ కేసుల్లో ఇరికించడం బాధాకరమని ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి నే కాకుండా మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి పై, పీఎస్ ఆంజనేయులు లాంటి ఉన్నత అధికారులపై అక్రమ కేసులు పెట్టి వేధించడం వంటి కార్యక్రమాలు మానుకొని హోమ్ శాఖ మంత్రి , ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం అభివృద్ధి పై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మెన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఛైర్మెన్ రసూల్, వైస్ ఛైర్మెన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమోళి, కౌన్సిలర్ లు రాజశేఖర్ రెడ్డి, ఖాదర్ భాషా,పద్మనాభ రెడ్డి, కో ఆప్షన్ చంద్రమోళి, వైసీపీ నాయకులు రంగాపురం మధు, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి,విజయ్ భాస్కర్ రెడ్డి, రవి, తోటం శెట్టి హరి, శ్రీరాములు, యూత్ నాయకులు జశ్వంత్ రెడ్డి, మారుతి రెడ్డి, ప్రశాంత్, జహీర్ పాల్గొన్నారు.

## రెండు రోజుల పాటు NAAC పర్యటన



రాయచోటి అర్బన్, మే 20 ప్రభాతవార్త

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ పీర్ బృందం రెండు రోజుల పాటు ఆన్లైన్ మాధ్యమంలో పర్యటించింది. NAAC షెడ్యూల్ ప్రకారం నిర్వహించిన ఈ పర్యటనలో పీర్ బృందం కళాశాల విద్యార్థులు, బోధన సిబ్బంది, ఆఫీస్ సిబ్బందితో వర్చువల్గా ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. కలాశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, పరిపాలన, సమాజ సేవా కార్యక్రమాలపై NAAC బృందం సమగ్రంగా సమీక్ష నిర్వహించింది. రెండవ రోజు చివర్లో ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. IQAC కోఆర్డినేటర్ బి. కిరణ్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం. మునియ నాయక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేశారు.

## ఒక వైపేమో కడప జిల్లాలో మహా నాడు మరొక వైపు జిల్లాకు అన్యాయం.

పోరుమామిళ్ల రూరల్ మే 19 ప్రభాతవార్త:



ఒక వైపు కడప జిల్లాలో మహా నాడు నిర్వహిస్తూ మరొక వైపు టిడిపి కడప జిల్లాకు అన్యాయం చేస్తోందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పోరుమామిళ్లలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిడిపి కూటమి 11 నెలల పాలనలో కడప జిల్లాకు అనేక విధాలుగా అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యం లో ఏర్పాటు కావలసిన ఉక్కు కర్మాగారం ఏర్పాటు కాలేదు. విభజన చట్టం ప్రకారం బుందేల్ ఖన్డ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కడప రాయ చోటి మదన పల్లి బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు నిలిచిపోయాయి. కడప రాజం పేట కోడూరు రేణిగుంట జాతీయ రహదారి పనులు మొదలు కాలేదు. నేషనల్ మెడికల్ కమీషన్ పులివెందుల మెడికల్ కళాశాల కు 50 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం వద్దని లేఖ వ్రాసింది. కళాశాల ప్రారంభం కాలేదు. మహానాడు లోపల పైన పేర్కొన్న అన్యాయాలలో కనీసం కొన్నింటినైనా పరిష్కరించాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ పీసీసీ సభ్యులు మండల అధ్యక్షులు అన్వర్, కాంగ్రెస్ పార్టీ నేతలు పీర, మహబూబ్ పీర్, ముజాహిద్, షైక్షా, ఆసిఫ్,అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి బలోపేతానికి కృషి చేస్తా

వీరబల్లి, మే 20, ప్రభాత వార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా నియమితుడైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డికి, కోడూరు మాజీ శాసన సభ్యులు కొరుముట్ల శ్రీనివాసులు కు, మదనపల్లె ఇన్చార్జ్ అహ్మద్ కు, రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు గాలివీటి రాజేందర్ నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజంపేట లో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని, ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి సాయి శక్తుల కృషి చేస్తానని అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ నరేష్ స్వామి, మరియు సర్పంచ్ చిన్న స్వామి, చిన్న గొల్లపల్లి సర్పంచ్ రామా జై చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులను తనిఖీ

కురబలకోట, మే 20 ప్రభాతవార్త



ఉపాధి హామీ పనులను ఏపీడి నందకుమార్ రెడ్డి తనిఖీ చేశారు. మండలంలోని కనసాని వారి పల్లి పంచాయతీ దిగవ బోయపల్లి వద్ద కూలీలు పీడర్ ఛానల్ పనిని చేస్తున్నారు. ఉపాధిహామీ పనులను పరిశీలనలో భాగంగా మంగళారం ఉదయం ఫీడర్ ఛానల్ పని వద్దకు విచ్చేశారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడారు. పని విధానంపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారి కూలీ 307 రూపాయలు వచ్చే విధంగా పనిచేయాలని సూచనలు చేశారు. రైతులు ఉపాది హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంచుకుంటే ఎకరాకు 27,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత కంపోస్ట్ పీట్లను తవ్వుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ మే నెలాఖరికి 25 పారం పండు గుంతలను కంప్లీట్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ కు సూచించారు. గ్రామంలో పనిచేస్తున్న అందరి కూలీల చేత యుద్ద ప్రాతిపదికన చేపట్టాలన్నారు. రెండు మూడు రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి అన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు కూడా జమవుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఏపిడి వెంట ఏపీవో సుబ్రహ్మణ్యం, టి ఏ నాగన్ గౌడ్, క్లస్టర్ టి ఏ బాబాజీ, కురబలకోట మండల సీనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

## కార్యకర్త శ్రేయస్సే ... జనసేన శ్రేయస్సు,

మైదుకూరు, మే 20, ప్రభాతవార్త:

నియోజకవర్గం పార్టీ క్రియాశీలక వాలంటీర్లకు కిట్లు పంపిణీ నియోజకవర్గ ఇంచార్జి పందిటి మల్హోత్రా,జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుల కుటుంబానికి అండగా నిలిచి జనసైనికుల సభ్యులకు ప్రశంసా పత్రం పంపిన పవన్ కళ్యాణ్, పట్టణ పార్టీ ఆఫీస్ నందు జనసేన పార్టీ ఇంచార్జి పందిటి మల్హోత్రా ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రతినిధులు పరిశీలనలో మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, బి.మఠం, దువ్వూరు చెందిన క్రియాశీలక సభ్యత్వ నమోదు ముఖ్య పాత్ర పోషించినటువంటి వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పందిటి మల్హోత్రా మాట్లాడుతూ జనసేన నాయకుల, జనసైనికుల, వీర మహిళల కుటుంబాలకు అండగా ఉండేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రారంభించిన 5 లక్షల రూపాయల జీవిత భీమా మరియు 50 వేల రూపాయల ప్రమాద భీమా కి సంబంధించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఐడి కార్డులు మరియు ప్రశంసా పత్రం క్రియాశీలక సభ్యులకు కేంద్ర కార్యాలయం సూచనలు మేరకు పంపిణీ చేశామని, పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారి భద్రతా, భవితవ్యం ఈ మెంబర్షిప్ ద్వారా పార్టీ వారికి భరోసానిస్తుందన్నారు.



## మిట్స్ లో గేట్ 2025 అర్హత సాధించిన విద్యార్థులను ప్రశంసా



కురబలకోట, మే 20 ప్రభాతవార్త

మదనపల్లె సమీపం లో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్) కళాశాల నందు జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్ 2025 అర్హత సాధించిన విద్యార్థులను ప్రశంసా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ పరీక్షలో విజయవంతంగా అర్హత సాధించిన విద్యార్థులను ప్రశంస కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన అన్నారు. మొత్తం 22 మంది విద్యార్థులు కళాశాల నందు గేట్ కు అర్హత అయ్యారని, అందులో సివిల్ ఇంజనీరింగ్ నుంచి 2, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగము నుంచి 9, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి 5, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి 2, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ 4, డేటా సైన్స్ ఒక్కరు అని ఆయన అన్నారు. ఆయన విద్యార్థుల కృషిని ప్రశంసించారు మరియు ఈ అద్భుతమైన మైలురాయి వైపు వారిని నడిపించడంలో అధ్యాపకుల నిరంతర మద్దతును ప్రశంసించారు. తన ప్రసంగంలో, గేట్ వంటి పోటీ పరీక్షల ప్రాముఖ్యతను ఆయన చెప్పారు, ఇది ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్య సంస్థలకు మరియు ప్రభుత్వ రంగ సంస్థలు (శిళీగీలు) మరియు పరిశోధనా సంస్థల్లో అవకాశాలకు నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన మొత్తం 22 మంది విద్యార్థులను వారి కృషి మరియు పట్టుదలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు మరియు జ్ఞాపికలతో సత్కరించారు. విభాగాధిపతులు, అధ్యాపక సభ్యులు మరియు మార్గదర్శకులు కూడా విజేతలను అభినందించడంలో పాల్గొన్నారు మరియు జూనియర్లకు స్ఫూర్తినిచ్చే ప్రేరణాత్మక అంతర్దృష్టులను పంచుకున్నారు. గేట్ అర్హత సాధించిన వారు తమ తయారీ వ్యూహాలు మరియు అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, డీన్ శ్రీమంత బసు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులను కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల తదితరులు అభినందనలు తెలియజేసారు.

## అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు.



చిట్వేలి, మే 20, ప్రభాతవార్త:

అర్హులైన లబ్ధిదారులందరికీ పక్కాగృహాలు వెంటనే మంజూరు చేస్తామని సంబంధిత జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి శివయ్య అన్నారు. మంగళవారం మైలపల్లి వైయస్సార్ రాజారెడ్డి ఎస్టి కాలనీ లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా మంజూరైన మరియు పూర్తయిన గృహలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు విన్నవించుకున్న కరెంటు సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ అధికారి చలపతికి సూచించారు. 60 కుటుంబాలకు గాను 20 మంది గుడిసెల్లో ఉన్నారని వారందరికీ పక్కా గృహాలను మంజూరు చేయాలని నిర్మాణంలో ఉన్న ఇండ్లు వెంటనే పూర్తి చేయాలని గృహ నిర్మాణ రాజంపేట డివిజన్ అధికారి మురళీకృష్ణ మండల హౌసింగ్ ఏఈ కి సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బొలేరో, 24క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

దువ్వూరు, మే 20, ప్రభాతవార్త:



మండల పరిధిలోని దువ్వూరు -ప్రొద్దుటూరు రహదారిలో ఎర్రబల్లె క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం బొలేరో వాహనంతో సహా 24క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని తెలియడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఎర్రబల్లె క్రాస్ రోడ్డు వద్ద బొలేరో వాహనం వెళ్తుండగా తనిఖీ చేయగా అందులో 24క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. రేషన్ బియ్యంతో పాటు సురేంద్రా అనే వ్యక్తిపైన కేసు నమోదు చేశామన్నారు. వీటి విలువ సుమారు లక్షా 10వేల 400రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్య ఉంటాయని హెచ్చరించారు.

## గ్రామాల్లో ప్రశాంతంగా జీవించండి



దువ్వూరు, మే 20, ప్రభాతవార్త:

ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎటువంటి గొడవలు పడకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ రియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మదిరేపల్లె, నారాయణ పల్లె గ్రామాల్లో పర్యటించారు. ప్రశాంతంగా జీవించి రెండు గ్రామాల్లో ఫ్యాక్షన్ అనే ముద్రను తొలగించుకోవాలన్నారు. ఇరు వర్గాలను కౌన్సిలింగ్ నిర్వహించారు. పలు చోట్ల తనిఖీలు కూడ జరిపారు. అనంతరం గ్రామస్థులుతో మాట్లాడుతూ ఫ్యాక్షన్ పెట్టుకున్న ప్రతి ఒక్కరు బాగుపడలేదని తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయారన్నారు. అందువల్ల ఫ్యాక్షన్ వీడి ప్రశాతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ద్వారకా సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాల ద్వారా బాలికల కౌమార దశ చితికి పోతున్నది..

సుండుపల్లి, మే 20, ప్రభాతవార్త :

ముదుంబాడు గ్రామ సచివాలయం నందు కిషోర్ బాలిక వికాసం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రామలక్ష్మి తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ కౌమార దశలోని పిల్లలకు ఆరోగ్యపరంగా శరీర ఎదుగుదలకు తీసుకోవలసిన ఆహారం గురించి మరియు నెలసరి సమయంలో పాటించవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల మరియు సచివాలయ మహిళా పోలీస్ అనిత మాట్లాడుతూ బాల్యవివాహాల ద్వారా బాలికల కౌమారదశ చితికి పోతున్నదని వారి చదువుకు అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని మరియు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు1098,181 ల ప్రాముఖ్యతను గురించి బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మమ్మ, పద్మ రెడ్డమ్మ లు, ఆశ వర్కర్లు ఓబులమ్మ, రెడ్డమ్మ, ఔట్రీచ్ వర్కర్ ఎ.అఫీదా లు పాల్గొన్నారు.



## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



బద్వేలు అర్బన్,మే 20, ప్రభాత వార్త

జూనియర్ ఎన్టీఆర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఎస్.కె బీ బ్రాయిలర్ చికెన్ సెంటర్ నిర్వాహకులు మోలాలి ఆధ్వర్యంలో 5,00 మందికి పైగా బిర్యానీ అందించారు. అలాగే అన్నా క్యాంటీన్ కి వచ్చే ప్రతి ఒక్కరికి మోలాలి సహకారంతో ఉచిత భోజనం టోకన్లు ఏర్పాటు చేశారు. అనంతరం బద్వేలు నంది పల్లె ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా మజ్జిగ వితరణ మరియు సేలం అనవసరంలోని చిన్నారులకు, ఆనందాశ్రమంలోని వృద్ధులకు మంచి ఆహార పదార్థాలను అందించారు. జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన్న సందర్భంగా ఎస్.కె దయాగ్నస్టిక్ సెంటర్ నాగేంద్ర సహకారంతో ఉచితంగా బిపి షుగర్ మరియు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎన్టీఆర్ అభిమానులు పలువురికి ఆదర్శంగా నిలిచారనడం లో అతిశయోక్తి లేదు.

## పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

బద్వేలు అర్బన్, మే 20 , ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా తప్పక కొనసాగించాలని, పిల్లలకు ప్రైమరీ స్థాయి నుండి పదవ తరగతి వరకు మాతృభాష అయిన తెలుగు మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టడం ఎంతైనా అవసరం ఉందని డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మానుగుంట రవిశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ఏ విద్యార్థి అయినా విషయపరిజ్ఞానాన్ని వారి మాతృభాష ద్వారానే సంపూర్ణంగా గ్రహించగలరని రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకుండా విద్యార్థులకు కేవలం ఇంగ్లీష్ మీడియం ద్వారానే బోధించమనడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు .రాష్ట్రంలో పాఠశాలల్లో ఉర్దూ, తమిళం, కన్నడం, ఒరియా లాంటి ఇతర మాధ్యమాలను కొనసాగిస్తున్నప్పుడు, మన మాతృభాషను పాఠశాలల్లో కొనసాగించకపోవడం విచారకరమని తెలిపారు .ప్రతిసారి వచ్చిన కొత్త ప్రభుత్వం విద్యా వ్యవస్థలో కొత్త సంస్కరణలు తీసుకురావడం ద్వారా విద్యారంగాన్ని బలహీనపరుస్తుందని తెలిపారు .మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల నియామకం సరికాదని వారిని ఉపాధ్యాయ,విద్యార్థి నిష్పత్తి తగ్గించి ఉన్నత పాఠశాలలు మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు .అర్హులైన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని కోరారు.

## బాల్యవివాహాలు మానండి శారీరక,మానసిక సమస్యలను తొలగిద్దాం

రాజుపాళెం,మే20,ప్రభాతవార్త.

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో మంగళవారం 6వ అంగన్వాడి కేంద్రంలో కిశోరబాలికలు,తల్లులకు నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలను ఆపుదాం చట్టరీత్యా నేరమని, మహిళల మానసిక,శారీరక సమస్యల నుండి రక్షించుకుందాం అని ఐటిసి ప్రదమ్కోఆర్డినేటర్ స్వరూపరాణి తెలిపారు.కిషోరబాలికల ఎదుగుదల వారికి కలిగే మార్పులు భయంను తొలగించుట,గర్భవతులు తల్లులకు పౌష్టిహాకారం విశిష్టతను వివరించారు ఆమె.ఈకార్యక్రమంలో సూపర్వైజర్ నాగరత్నమ్మ,కార్యదర్శి రామాంజనమ్మ,మహిళా పోలీసు గౌసియా,కార్యకర్తలు సుహాసిని,అనురాధ తదితరులు పాల్గొన్నారు.





## ఆంధ్ర కేసరి, బ్రహ్మానందరెడ్డిలకు నివాళి

వేంపల్లి: మే 20 (ప్రభాత వార్త)):



మాజీ ముఖ్య మంత్రులు స్వర్గీయ ప్రకాశం పంతులు 68 వ వర్ధంతిని, కాసు బ్రహ్మానంద రెడ్డి 31 వ వర్ధంతిని మంగళవారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్య సభ మా జీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమర యోధునిగా,ఆంధ్ర రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా, సమైక్య మద్రాస్ రాష్ట్ర ముఖ్య మంత్రి గా అటు కాంగ్రెస్ పార్టీ కి, ఇటు రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారన్నారు. సైమన్ కమీషన్ కు ఎదురొడ్డి ఆంధ్ర కేసరి గా పేరు గాంచారన్నారు. విజయవాడ వద్ద కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజి ఆయన మానస ప్రాజెక్టు. ఆయన బట్టలు ఆయనే ఉతుక్కునే వారట, అంతటి నిరాడంబరుడు.బీసీల దేవుడు బ్రహ్మానంద రెడ్డిస్వర్గీయ కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర మంత్రిగా,ముఖ్య మంత్రి గా,కేంద్ర మంత్రి గా, గవర్నరుగా, ఏఐసీసీ అధ్యక్షునిగా అటు కాంగ్రెస్ పార్టీకి,ఇటు రాష్ట్రానికి, దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయ రెడ్డి,డాక్టర్. సుబ్రమణ్యం, అమర్ నాథ్ రెడ్డి,ఉత్తన్న,బద్రి, నాగరాజు, రమణ, వినయ్,వేమా రాజా,వేమయ్య, మదార్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు ఏర్పాట్ల పరిశీలన

వేంపల్లి : మే 20 (ప్రభాత వార్త)):



తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడప గడపలో నిర్వహించబోయే మహానాడు కార్యక్రమం ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ మహాసభ ప్రాంగణాన్ని కడప జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డి , పులివెందుల సర్పంచుల సంఘం తాలుకా అధ్యక్షుడు బోగ్గుల భాస్కర్ రెడ్డి మంగళవారం సందర్శించి పరిశీలించారు. సభా ప్రాంగణంలోని వేదిక నిర్మాణం, పార్కింగ్, భద్రత, తాగునీటి సదుపాయాలు, స్వచ్ఛత తదితర ఏర్పాట్లను వారు సమీక్షించారు. అనేక మంది కార్యకర్తలు, నాయకులు, ప్రత్యేక అతిథులు పాల్గొనే నేపథ్యంలో అన్ని విధాలా ఏర్పాట్లు ఉండాలంటూ నిర్వాహకులకు వారు సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు, పార్టీ భవిష్యత్ దిశగా కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఇది వేదికవుతుందన్నారు. మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు సింగారెడ్డి జయ రామి రెడ్డి పిలుపునిచ్చారు.

CHANGE OF SUR NAME

I MADISETTY PAVAN KUMAR S/O MADISHETTY NARASIHMULU (old name) D.NO:4/1462-15-2-1,Hanuman Nagar street Proddatur town and mandal ysr dt. 516360 is changed my sur name MADISHETTY PAVAN KUMAR s/o. MADISHETTY NARASIHMULU (new sur name) henceforth i am being called as MADISHETTY PAVAN KUMAR for all purposes.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మదనపల్లి మే 20 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు, పేదలకు వ్యతిరేకంగా కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా పరిపాలన చేస్తున్నాయని ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. లేబర్‌కోడ్‌లు రద్దు చెయ్యాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలి, రైతు పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి, టమోటా మార్కెట్ లో జాక్ పాట్ రద్దు చెయ్యాలి, ఉపాధి పని 200రోజులకు పెంచాలి, 600 రూపాయలు వేతనం ఇవ్వాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు కై చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20వ తేదిన సమ్మెకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. దేశంలో వచ్చిన మతోన్మాద, ఉగ్రవాద చర్యలు నేపథ్యంలో సమ్మె వాయిదా వేశారని, కేంద్ర ప్రభుత్వ దుర్మార్గమైన ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా చేస్తున్నట్లు వివరించారు. లేబర్ కోడ్ రద్దు చేయడం, ఇండియన్ లేబర్ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం, నెలవారీ కనీస వేతనం రూ.



ధర్నా చేస్తున్న దృశ్యం

26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ పెన్షన్ రూ. 9,000 అందించడం సహా పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల వ్యతిరేకతను అర్థం చేసుకుని చట్టాలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కి సిద్ధమవుతున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి. ప్రభాకర్ రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, నాగరత్న, కృష్ణ, సవిత, రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, శంకర్ నాయక్, గౌరీ, ప్రమీల, సుగుణ, ప్రభావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతం కోసమే సభ్యత్వాలు



పెద్దమండెం మే 20 ప్రభాతవార్త

నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం కోసమే క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేస్తున్నట్లు కమ్మలపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ అన్నారు మంగళవారం మొలకలచెరువులోని జనసేన పార్టీ నూతన కార్యాలయంలో సభ్యులతో సమావేశమై సభ్యత్వాలను అధిక సంఖ్యలో పూర్తి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు పెద్దమండెం మండలంలోని జనసేన పార్టీ నాయకులు అష్రాఫ్ ధనుంజయ్ ప్రకాష్ రెడ్డి నాగూర్ హోలీలో మండలంలో 250 కి పైగా క్రియాశీలక సభ్యత్వాలు చేశారన్నారు వీరికి గుర్తింపు కార్డులు మరియు కిట్లు అందించినట్లు ఆయన అన్నారు కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలని తెలిపారు ప్రతి ఒక్కరూ నాయకులు కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆడపిల్లల పట్ల వివక్ష
# అసమానతలను అధికమించాలి

రామాపురం మే 20 ప్రభాతవార్త

సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్ష అసమానతలను అధికమించాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి వై పద్మావతి పేర్కొన్నారు మండలంలోని గువ్వలచెరువు సెక్టార్ కసిరెడ్డి గారి పల్లెపంచాయతీ సూర్యనారాయణపురం చిట్లూరు సెక్టార్ బండపల్లి పంచాయతీ వెంకట్ రెడ్డి గారి పల్లె మంగళవారం జరిపిన సమ్మర్ కోచింగ్ లో కిషోరీ బాలికల వికాసం కార్యక్రమం కార్యక్రమానికి సిడిపిఓ హాజరయ్యారు రామాపురం సెక్టార్ హసనాపురం పంచాయతీ కస్పా లో సూపర్వైజర్ హుస్సేనమ్మ హాజరయ్యారు ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల పుట్టినప్పుడు నుండి వివక్షత ఎదుర్కొంటుంటారని మగ పిల్లలకి ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుంటారని అన్నారు ఆడపిల్లలు మగ పిల్లలకు ఏ విషయంలోనూ తీసిపోరని ఎంతో మంది మహిళా మణులు నిరూపణ చేశారని అన్నారు ఇటీవల అంతరిక్షానికి వెళ్లి తిరిగి వచ్చిన సునీత విలియమ్స్ పాకిస్తాన్ లోని టెర్రరిస్టులను అంతం చేయడానికి మనం దేశం తరఫున ఆపరేషన్ సింధూరం పాల్గొన్న వీరనారీమణులను ఆదర్శంగా తీసుకొని కిషోర్ బాలికలు లక్ష్యాలను నిర్ధారించుకుని ముందుకు సాగాలని సమాజంలోని మూస పద్ధతులను పట్టుకుని తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదన్నారు మగ బిడ్డ అయినా ఆడబిడ్డయినా ఇద్దరికీసమానంగా అవకాశాలు ఇవ్వాలన్నారు ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక హక్కులు చట్టాలు కల్పించాయని కిషోర్ బాలికలు హక్కులను చట్టాలను అవగాహన చేసుకుని తమకు లక్ష్యాలను నిర్ధారించుకుని బాగా చదివి ముందు సాగాలని ఆమె పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు పద్మజారాణి సుజాత జి ఎం ఎస్ కే లు రజిని రాణి అంగన్వాడి కార్యకర్తలు మాబుజాన్ జయమ్మ రవణమ్మ ఆరోగ్య కార్యకర్తలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన జయచంద్ర రెడ్డి

మదనపల్లి మే 20 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంగళవారం విజయవాడలో తంబళ్లపల్లె టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి దాసరిపల్లి జయచంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లి నియోజకవర్గ అభివృద్ధి గురించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించారు. కడపలో జరిగే మహానాడు విజయవంతం పై కూడా చర్చించారు. అనంతరం మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సవిత, టిడిపి సీనియర్ నాయకులు ను ఆయన కలిశారు.

# భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

## బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు వినతి

మదనపల్లి మే 20 ప్రభాతవార్త


ఏవోకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం.

చెరువులను, కాలవలను కబ్జా చేసి ప్లాట్లుగా తయారుచేసి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్‌లో అక్రమంగా చెరువులను కబ్జా చేసి ప్లాట్లుగా తయారుచేసి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన బివైఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. అనంతరం బహుజన్ యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ మదనపల్లి మండలం బసినికొండ పంచాయితీ రామాచార్లపల్లి సమీపంలో రైతులకు, వ్యవసాయానికి ఉపయోగపడే సాగునీరు చెరువులను, వంకలను, సాగునీరు కాలువలను కొంతమంది ప్రవేట్ వ్యక్తులు అక్రమంగా పూడ్చివేసి ప్లాట్లుగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నారన్నారు, రైతు పంట సాగుకు ఎంతగానో ఉపయోగపడే చెరువులను వాగు వంకలను కాలువలను కబ్జాదారులు మాయం చేస్తుంటే అధికారులు కళ్ళ ఎదుట ఇంతటి అక్రమాలు జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు, ఒక రామాచార్లపల్లి సమీపంలోనే కాకుండా మదనపల్లి పరిసరాల్లో ఉన్న చెరువులు కాలువలు పరిస్థితి కూడా ఇలాగే ఉందని, శాసనసభ్యులు షాజహాన్ భాషా మదనపల్లిలో భూ కబ్జాలకు ఆస్కారం లేకుండా, భూ కబ్జాదారులను కబ్జాలు చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్తుంటే, మరి ఇంతటి కబ్జాలు ఎందుకు జరుగుతున్నాయని, ఈ చెరువులకు సంబంధించి కబ్జాలు శాసనసభ్యులు దృష్టికి రాలేదేమో, కనీసం ఇప్పుడున్న శాసనసభ్యులు చెరువుల్లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ చెరువులు కాలువలు వంకలు లేకుండా కబ్జాలకు పాల్పడుతూ అమ్మకాలు చేస్తూ, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బివైఎస్ నాయకులు హరికృష్ణ, శశి కుమార్, శ్రీనివాసులు, వినయ్, శివ, షేన్‌షా, జిలాని భాష, బ్రహ్మ, శశి, తదితరులు పాల్గొన్నారు.

# ఐటిఐలలో చేరుటకు 24న తుది గడువు

ఎడ్యుకేషన్ మే 20 ప్రభాతవార్త

జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఐటిఐలలో చేరుటకై ధరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల అనగ 24 మే 2025 తుది గడువుగా నిర్ణయించారు. కావున 10 వ తరగతి పాస్ లేక ఫెయిల్, ఇంటర్‌పాస్ లేక ఫెయిల్ మరియు ఆపై విద్యార్హతలు ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ 10 వ తరగతి మార్కుల జాబిత, ఆధార్ కార్డ్, కుల ధృవీకరణ పత్రము, ఫోను నెంబర్, మెయిల్ ఐ.డి., మరియు పోటో తీసుకొని తమకు దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటిఐ వద్దకు వెళ్ళి iti.ap.gov.in అను వెబ్ సైట్ ద్వారా ఉచితముగా ఆన్‌లైన్‌లో తమ ధరఖాస్తును రిజిస్టర్ చేసుకొనవచ్చును. అభ్యర్థులు స్వయముగ కూడా రిజిస్టర్ చేసుకొనవచ్చును. రిజిస్టర్ చేసిన ధరఖాస్తును తప్పని సరిగా వెరిఫికేషను చేయవలెను. వెరిఫికేషను చేయని ధరఖాస్తులు అడ్మిషను పొందుటకు అనర్హులు. కావున అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకొనవలెనని జిల్లా కన్వీనర్ /ప్రిన్సిపల్ యం. జ్ఞాన కుమార్ తెలియచేస్తున్నారు.

# ఫారంఫాండ్ పనులను పరిశీలించిన పీడీ



గాలివీడు, మే 20(ప్రభాతవార్త):

మండలంలోని నూలివీడు గ్రామం చీమలచెరువుపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారంఫాండ్ పనులను మంగళవారం అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫారం ఫాండ్ పనులను చేపట్టిందని ఈ పనుల వలన రైతులకు నీటినిల్వలు ఉండి అవసరమైన సమయంలో నీటిఎద్దడి లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమిలోని నీటినిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు. పనులకు హాజరైన వేతనదారులు, వారికి ఇచ్చిన కొలతల ప్రకారం పని పూర్తి చేసుకుని రోజుకు సగటు రూ.300 పొందే విధంగా పనులు చేయాలని వేతనదారులకు, సిబ్బందికి సూచించారు. అంతేగాక ఉపాధి హామీ పథకం పనుల్లో పూర్తిగా పారదర్శకత పాటించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యధిక పనిదినాలు కల్పించి, ఆర్థిక భరోసా కల్పించాలని ఏపీఓలకు సూచించారు. ఏపీఓలు హరిబాబు, రామచంద్ర, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా ఆ రహదారి

సిద్ధవటం మే 20 ప్రభాతవార్త



రహదారికి ఇరువైపులా ముళ్ళ పొదలు అలుముకుపోయిన తొలగింపు చర్యలు చేపట్టడంలో ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్య ధోరణివహిస్తున్నారు ఆ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది మండలంలోని నే క నా పురం గ్రామం నుండి మాధవరం ఉప్పరపల్లి, కొత్త మాధవరం పార్వతిపురం తదితర గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు రోడ్లు ఇరువైపులా ముళ్ళ పొదలు అలుముకు పోవడంతోద్విచక్ర వాహనదారులు ఆటో కార్మికులు చోదకులకు ఇబ్బందులు తలెత్తాయి ప్రమాదాలు అరికట్టేందుకు రహదారి ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలను పూర్తిగా తొలగించాలని గ్రామస్తులు వాహనదారులు తెలియజేశారు.ముళ్ళ పొదలు తొలగింపుకై ఆర్ అండ్ బి ఏఈ గంగిరెడ్డి వివరణ కోరగా నే క నా పురం నుండి మాధవరం గ్రామానికి వెళ్లే రహదారి ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలను ముళ్ళ పొదలను తొలగింపు చర్యలు చేపడతామని ఏఈ గంగిరెడ్డి పేర్కొన్నారు

# నేటి నుండి ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ

ఎడ్యుకేషన్ మే 20 ప్రభాతవార్త :

ఉమ్మడి కడప లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పోరేషన్ మరియు మునిసిపాలిటీ యాజమాన్యముల యందు పనిచేయుచున్న గ్రేడు ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ రేపటినుండి ప్రారంభమగును. కావున తప్పనిసరి బదిలీ అగువారు, అభ్యర్థన బదిలీ కోరువారు అందరూ రేపటినుండి అన్లైను నందు బదిలీ కొరకు అప్లికేషను పూర్తిచేయవలయుటకు సన్నద్ధంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి శంసుద్దీన్ తెలిపారు

# మండలంలో దివ్యాంగుల సర్వే

తంబళ్లపల్లె 20 ప్రభాతవార్త ః



మండలంలో స్థానిక భవిత కేంద్రం ఐఈటిఎస్. రేఖ ఆధ్వర్యంలో ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడుల సూచనల మేరకుముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఐఈటి రేఖ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కే. సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యా కోఆర్డినేటర్ జనార్ధన్ ఆదేశాల మేరకు మండలంలో సుడిగాలి పర్యటన చేసి దివ్యాంగ పిల్లలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. గుర్తించిన పిల్లలను భవిత సెంటర్లో దివ్యాంగ పిల్లలకు భవిష్యత్తులో మానసిక రుగ్మతను పోగొట్టి వారికి సరళీకృతమైన భాషలో విద్యతోపాటు వారిలో మానసిక చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి భవిత కేంద్రానికి తరలించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు.

# వినియోగదారుల రక్షణే ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవం ధ్వేయం

పీలేరు మే 20 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా రొంపిచర్ల మండలం పరిధిలో ప్రపంచ కొలతలు మరియు తూనికల దినోత్సవం 2025 పురస్కరించుకొని డిఎన్టి సంఘాల సభ్యులతో అవగాహన సమావేశం మంగళవారం గ్రేట్ విజన్ సొసైటీ, పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ మరియు మండల వినియోగదారుల సమాచార కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని పరివర్తన సేవా సంస్థ అధ్యక్షులు, డిఎన్టి సీడ్స్ స్కీమ్ జిల్లా ప్రాజెక్ట్ ఇంచార్జ్ పి అమర్నాథ్ తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రధాన వక్తగా విచ్చేసిన డాక్టర్ జీవీఎస్ బాబు మాట్లాడుతూ సమాజంలో గర్భస్థ శిశువు నుండి వృద్ధాప్యంలో ఉన్న ప్రతి వ్యక్తి తమ దయనిందుని జీవితంలో వినియోగదారుడేనని కాబట్టి ప్రతి వినియోగదారుడు తమ కుటుంబ అవసరాల కోసం కొనుగోలు చేసే ప్రతి వస్తువులను నాణ్యత, పరిమాణము, వస్తువులను వాడకం గడువు తేదీ మరియు సంవత్సరము తప్పనిసరిగా పరిశీలించి తర్వాతనే కొనుగోలు చేయాలని మహిళలకు ఆయన సూచించారు. అలాగే డిఎన్టి సంఘాల సభ్యులు మరియు పిల్లలు, యువత పేపర్లు,సెల్ ఫోన్లు, కరపత్రాలు, ఇతర ప్రసారమాధ్యమాల ద్వారా వినియోగదాల చట్టాలు హక్కుల పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని ఆయన తెలియజేశారు . అలాగే డిఎన్టి సీడ్స్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ ( పరివర్తన సేవా సంస్థ ) ఈ అమర్నాథ్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019 ప్రకారం, వినియోగదారులు కొలతలు తూనికలు 2009 ప్రకారం ప్రతి వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతి 200 రూపాయల పైబడిన వస్తువుకు షాపు నుండి కచ్చితంగా బిల్లు అడిగి తీసుకోవాలి అలా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో సంభవించే వస్తువు నాణ్యత లోపం, పరిమాణ లోపం ఉన్నట్లయితే వెంటనే వినియోగదారుడు షాప్ కు వెళ్లి తిరిగి కొత్త వస్తువులు పొందే అవకాశం ఈ చట్టం కల్పించింది, అలా ఇవ్వని షాప్ యజమాని పై జిల్లా పరిధిలో ఉన్న "జిల్లా వినియోగదారం ఫోరం " లో ఫిర్యాదు చేసి ఉచిత న్యాయం సర్వీసులు పొందటంతో పాటు నష్టపరిహారం రూపంలో లబ్ది కూడా అధిక మొత్తంలో వినియోగదారునికి చెల్లించే విధంగా ఈ చట్టం రూపొందించబడింది, కాబట్టి ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దారును, మండల వినియోగదారుల సమాచార కేంద్రాన్ని, జిల్లాస్థాయిలో డీఎస్వోను, డిస్టిక్ కన్స్యూమర్ కౌన్సిల్ ను మరియు జిల్లా వినియోగదారుల ఫోరం ద్వారా వినియోగదారు రక్షణ పొందవచ్చని ఆయన మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామం నుండి శ్రీ వినాయక డిఎన్టి సంఘం, శ్రీ లక్ష్మీనరసింహ డిఎన్టి సంఘం లీడర్లు, సీసీపీస్ రాణమ్మ లక్ష్మీ ప్రసన్న అనిత లలితమ్మ గ్రేట్ విజన్ సొసైటీ సభ్యులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యాపకుడికి జేఎన్టీ అనంతపురం డాక్టర్ పట్టా

కురబలకోట, మే 20 ప్రభాతవార్త



కురబలకోట మండలం అంగళ్లకు సమీపంలో ఉన్న విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నందు పనిచేస్తున్న బి సురేష్ బాబుకు జేఎన్టీయూ అనంతపూర్ వారిచే డాక్టరేట్ పట్టా ప్రధానం చేయడం జరిగినది. బి సురేష్ బాబు మెడికల్ ఇమేజ్ ఫ్యూషన్ అనే అంశం మీద, చేసిన పరిశోధనలకుగాను మరియు తను శోధించిన అంశాలను ప్రముఖ ఎస్సీఐ జర్నల్స్ లో ప్రచురింపబడినవి. తన పరిశోధన ఎన్ హన్స్ డ్ ఫ్యూషన్ టెక్నిక్స్ ఆన్ మల్టీ మోడల్ మెడికల్ ఇమేజెస్ యుసింగ్ మోడ్రన్ ఆప్టిమైజేషన్ అప్రోచెస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవములో డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ ఎం ప్రభాకర్ రెడ్డి మాట్లాడు తూ, ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్క అధ్యాపకుడు డాక్టర్ పట్టా తీసుకోవాలని, తద్వారా సమాజానికి ఉపయోగపడే ఎన్నో అంశాలను క్షుణ్ణంగా పరిశోధించి, ఉన్నత సమాజాన్ని తీర్చిదిద్దే కార్యక్రమంలో మీ వంతు కొంత నాలెడ్జిని పెంపొందించాలని తద్వారా మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేయడంలో మీ వంతు కృషి చేయాలని తెలియజేశారు. అదేవిధంగా విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ డి రమణారెడ్డి మాట్లాడుతూ రాబోయే భావితరాలకు కావలసిన టెక్నికల్ నాలెడ్జ్ అంశాలపై పరిశోధన చేయాలని పిలుపునిచ్చాడు. అదేవిధంగా సురేష్ బాబుకు కాలేజీ మేనేజ్మెంట్, ప్రిన్సిపల్, వివిధ భాగాల డీన్స్, వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వరంలాంటిది

సిద్ధవటం మే 20 ప్రభాతవార్త



మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలు ద్వారా వేల కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు మంగళవారం ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం లో మాట్లాడుతూ ఈ పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలుపుతూ మహిళ సాధికారతకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఉచిత పథకాల పేరుతో రాష్ట్రాన్ని దోపిడి వ్యవస్థ చేసి రాష్ట్ర ఖజానా దివాలా చేశారని రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు.

# రైతులకు జనుములు పంపిణీ

సిద్ధవటం మే 20 ప్రభాతవార్త




సిద్ధవటం మండల కేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు (జనుము) పంపిణీ చేయడం జరిగింది. అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించి నమోదు చేసుకొని రైతు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లిస్తే వెంటనే సదరు విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ కే రమేష్ రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు బి. శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

# పాపిరెడ్డి రఘునాథరెడ్డి భౌతిక కాయానికి నివాళు

రాయచోటి అర్బన్, మే 20 ప్రభాత వార్త



రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మంగళవారం రాయచోటి మండలం, అబ్బవరం, కట్టవకిందపాపిరెడ్డిగా రిపల్లెకు చెందిన పాపిరెడ్డి రఘునాథరెడ్డి మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తపాలా భీమా ఏజెంట్ల కొరకు దరఖాస్తుల

ప్రొద్దుటూరు అర్బన్, మే 20, ప్రభాత వార్త :

తపాలా భీమా ఏజెంట్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తపాలా జీవిత భీమా డెవలప్మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత భీమా మరియు గ్రామీణ తపాలా జీవిత భీమా డైరెక్ట్ ఏజెంట్లుగా ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాలలో పనిచేయుటకు దరఖాస్తులు పంపాలని, 10వ తరగతి పూర్తయ్యి 18 నుండి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29, 30వ తేదీలలో స్థానిక మున్సిపల్ ఆఫీసు దగ్గర వున్న తపాలా సూపరింటెండెంట్ వారి కార్యాలయం (ప్రధాన తపాలా కార్యాలయం)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వాక్ ఇన్, ఇంటర్వ్యూ కు వారి ఎస్సెస్సీ, ఆధార్, పాన్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 2 పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. ఎంపిక చెయ్యబడిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ క్రింద రూ. 5000/ లు కెవిపి లేదా ఎన్సెస్సీ ల రూపంలో (రీఫండబుల్) చెల్లించాలని, ఎంపిక చెయ్యబడిన ఏజెంట్లకు, వారు చేయు పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్ చెల్లించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని తపాలా సూపరింటెండెంట్ వారి కార్యాలయం (ప్రధాన తపాలా కార్యాలయం), వి. సత్యనారాయణ డెవలప్మెంట్ ఆఫీసర్, తపాలా జీవిత భీమా గ్రామీణ తపాలా జీవిత భీమా, ప్రొద్దుటూరు డివిజన్, 8498977463 లను సంప్రదించాలని సూచించారు.

# జాంబవ భవన నిర్మాణం కొరకు విరాళాల సేకరణ




బద్వేల్ అర్బన్, మే 20, ప్రభాతవార్త

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బద్వేలు తాలూకా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు ఎర్రబల్లె ఓబయ్య అధ్యక్షతన "మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం" మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మాదిగ ఉద్యోగులు తమ సభ్యత్వాలను నమోదు చేసుకోవడమే కాకుండా మాదిగ జాతికి ఎస్సీ వర్గీకరణ విజయం సాధించినందుకు గాను గుర్తుగా మందకృష్ణకు హైదరాబాదులో జాంబవ భవనం నిర్మాణము చేయడంలో విరాళాలు సేకరణ వేగవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు పిచికే బాబు పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ విజయ సారథి మందకృష్ణకు మాదిగకు ఎల్లవేళలా మాదిగ జాతి రుణపడి ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు దేవరపల్లి బిక్షాలు, జాతీయ, జిల్లా, తాలూకా నాయకులు, మాదిగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు దేవానందం, శోభన్, గురయ్య, మాజీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, ప్రసాద్, జయ చంద్రబాబు, ముండ్లపాటి పిచ్చయ్య, ఓ.ఎస్.వి ప్రసాద్, బాల ఓబయ్య , సుమన్, బాలయ్య, వీరయ్య, రవి, రాజారావు, కృష్ణయ్య, రవి, సుందరయ్య, శివయ్య, గ్రేసెస్, తదితరులు పాల్గొన్నారు.

# రేపు విశ్వనాథపురం వీరాంజనేయ స్వామి తిరుణాల

చాపాడు. మే 20. ప్రభాతవార్త

మండలంలోని విశ్వనాథపురం గ్రామం నందు గురు,శుక్రవారాలలో హనుమాన్ జయంతి సందర్భంగా 33వ జయంతిఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణలతోపాటు సహస్రనామార్చన, హనుమాన్ జపములు, భక్తి కార్యక్రమంలో తో పాటు శుక్రవారం ఓల్డ్ కేటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# మినీ మహానాడుకి 26, 27 వార్డు నాయకులు ప్రజలు

ప్రొద్దుటూరు మే 20 ప్రభాతవార్త

ప్రొద్దుటూరులో నిర్వహించే నియోజకవర్గ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు పురపాలక సంఘం పరిధిలోని 26, 27 వార్డులకు చెందిన టిడిపి నాయకులు తలారి పుల్లయ్య తలారి రమేష్ సాయిరాం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రజలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని కాంక్షించి గత ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టంబు కట్టారని తెలిపారు.



# బోనాల పండుగలో ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి, మే 20, ప్రభాతవార్త:

మండలంలోని తాటిగుంటపల్లె పంచాయతీలో షికారి పాలెంలో సోమవారం జరిగిన బోనాల పండుగలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు ఆయనకి ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు ,ఈ గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా అమ్మవారి గుడి నూతనంగా నిర్మించడం జరిగింది. పూర్తి కావడంతో సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్ర నాథ్‌రెడ్డి, సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, పెద్దివీడు సర్పంచ్ నాగిరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ జయచంద్ర, వైయస్సార్సీపి నాయకులు సంఘం వారి పల్లె నరసింహులు సానిపాయి పంచాయతీ వెంకటరమణ, స్థానిక వైయస్సార్సీపి నాయకుడు. మల్లూర్ నాయక్పె, తదితరులు పాల్గొనడం జరిగింది.


బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

# దళిత విద్యార్థిపై దాడి అమానుషం

ఎడ్యుకేషన్ మే 20 ప్రభాతవార్త :

తిరుపతి, విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం చదువుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించడం దారుణమైన చర్యని,పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ఒక ప్రకటనలో ఖండించారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లేడ్ గ్యాంగ్ ల పై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రుయా ఆస్పత్రిలో చేరిన బాధిత విద్యార్థి జేమ్స్ కు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రౌడీషీటర్ అండ్ గ్యాంగ్ పై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. కులం పేరుతో దూషించి చంపేందుకు కుట్ర చేసిన వారి పై హత్యాయత్నం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. జేమ్స్ కు తక్కువ జాతివాడంటూ ప్రతి రోజు అవమానించడం, మూత్రం నోట్లో పోసి ఒకటిన్నర రోజు చిత్ర హింసలు పెట్టడం, ఆటవిక చర్యతో పాటు కులదురంకార చర్య అన్నారు. ఈ దుర్మార్గమైన చర్యను పిడియస్ యు రాష్ట్ర కార్యవర్గంగా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జేమ్స్ కు న్యాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడియస్‌యు నగర నాయకులు వెంకటేష్,అఖిల్ నాయుడు,రాజా తదితరులు పాల్గొన్నారు.



# రాజంపేటలో సింధూరం తిరంగా యాత్ర

**దేశాన్ని కాపాడే సైనికులే నిజమైన వీఐపీలు... టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు**



తిరంగా యాత్రలో కూటమి నేతలు జగన్ రాజు, రమేష్ నాయుడు తదితరులు



తిరంగా యాత్రకు త్రివర్ణ పతాకలతో పోటెత్తిన జనం

**రాజంపేట అర్బన్, మే20 ప్రభాతవార్త**

రాజంపేటలో సింధూరం ఆపరేషన్ సక్సెస్ నేపథ్యంలో భారత సైనికులకు మద్దతుగా చేపట్టిన తిరంగా యాత్రకు జనం పోటెత్తారు. త్రివర్ణ పతాకాలతో రాజంపేట రెపరెపలాడింది. జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. జయహో మోడీ ...జయహో సింధూరం ...అంటూ నినాదాలు చేశారు. దేశభక్తి ఉవ్వెత్తున ఎగిసింది. మంగళవారం స్థానిక ఆర్ఎంపీ బంగ్లా నుంచి పాత బస్టాండ్ వరకు తిరంగా యాత్ర అత్యంత శోభాయామానంగా జరిగింది. దేశభక్తి భావం వెల్లివిరిసేలా తిరంగా యాత్రలో భారతీయ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. అఖిలపక్ష నేతలు ,కూటమి పార్టీల నేతలే కాకుండా అన్ని వర్గాల ప్రజల మద్దతుతో తిరంగా యాత్ర భారీ త్రివర్ణ పతాకాలతో జరిగింది. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు మాట్లాడుతూ భారత సరిహద్దుల్లో నిరంతరం రెప్ప వేయకుండా కాపాడే సైనికులే నిజమైన విఐపి లని అభివర్ణించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరు దేశ సైనికులకు రుణపడి ఉండాలని ఆకాంక్షించారు.భారతదేశంలో కులం లేదు, మతం లేదు అందరిదీ ఒకటే జెండా అది భారతీయ మువ్వన్నెల జెండా అని, ప్రతి ఒక్కరూ ఆ జెండాకు గౌరవం ఇస్తూ ఆ జెండా కోసం సరిహద్దుల్లో కాపలా కాస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశభద్రతకు పని చేస్తున్న సైనికులకు రుణపడి ఉండాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎక్కడైనా సైనికులు కనబడితే వారికి విఐపి గౌరవం అందించి అందరూ వారిని గౌరవించాలని ఆయన తెలియజేశారు. దేశంలో నిజమైన వీఐపీలు అంటే సైనికులే ననీ, వారి ప్రాణం అడ్డువేసి ప్రజల ప్రాణాలు కాపాడుతూ, దేశ గౌరవాన్ని కాపాడుతున్నారని ఆయన కొనియాడారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోత రమేష్ నాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ కు తగిన బుద్ధి చెప్పిన భారత సైనికులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఇంత పెద్ద ఎత్తున కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, మనం భారతీయులమని, మనం ఇక్కడే బతకాలని, మన జెండా మువ్వన్నెల జెండా అని, ఆ జెండా కింద ఉన్నంతవరకే మనకు గౌరవమని ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమిస్తూ, సైనికులను గౌరవిస్తూ దేశ సేవ కోసం, దేశ ప్రతిష్ట కోసం పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పోతుగుంట రమేష్ నాయుడు, పట్టుపోగుల ఆదినారాయణ, టిడిపి నేతలు అబూబకర్, బాస్ నేను వెంకటేశ్వర్లు శివ నారాయణ చౌదరి, జనసేన నేతలు శివరామరాజు, రామ శ్రీనివాసులు, పలు ప్రజా సంఘాల నేతలు, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ నేతలు, యువత పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నిరసన**



నిరసన తెలుపుతున్న దృశ్యం.

**మదనపల్లి మే 20 ప్రభాతవార్త**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా,ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పాలన తోస్తోందని స్వాతంత్ర్యానికి ముందే బ్రిటీష్ పాలకులపై పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, సీపీఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి లు ఆరోపించారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలుగా మారుస్తోందని విమర్శించారు.జూలై 9వ జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు ఆటో కార్మికులకు పిఎఫ్ ఈయస్ఐ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రద్దు చేసిన భవణ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు.మదనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనాలు మే ఆఖరికి ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ బస్టాండ్ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్ ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, మదనపల్లి పట్టణ కార్యదర్శితిరుమల,చలపతి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ట్రయల్ కోర్టుల పనితీరుపై

# సుప్రీం కోర్టు అసహనం

**(చిన్న చిన్న కేసుల్లో సహితం బెయిల్ పిటీషన్లు సుప్రీం కోర్టు ముందుకు రావడం దురదృష్టకరం)**

**బద్వేలు లీగల్, మే 20 ప్రభాతవార్త :**

ట్రయల్ కోర్టులలో న్యాయాధికారులు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీం కోర్టు ముందుకు తీసుకురావడం దురదృష్టకరమని సుప్రీం కోర్టు ధర్మాసనం తన అసహనాన్ని వ్యక్తం చేస్తూ ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం, ఇది తొలి సారి కాదని, చిన్న చిన్న నేరాలకు సంబంధించిన వ్యాజ్యాలలోను బెయిల్ మంజూరు చేయడంలో ట్రయల్ కోర్టులు మరింత ఉదారతతో వ్యవహరించాలని కూడా సూచిస్తూ చాలా సాధారణమైన వ్యాజ్యాలలో ధర్మాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటీషన్లను తిరస్కరించడాన్ని ధర్మాసనం తప్పు పట్టింది. ట్రయల్ కోర్టుల తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేస్తూ ప్రజాస్వామ్య దేశంలో పోలీసుల రాజ్యంలా పనిచేయకూడదని హితవు పలికింది. రెండు దశాబ్దాల క్రితం చిన్న చిన్న కేసుల్లో బెయిల్ పిటీషన్లు హైకోర్టు, సుప్రీం కోర్టులకు చాలా అరుదుగా వచ్చేవని ధర్మాసనం తెలుపుతూ ట్రయల్ కోర్టు స్థాయిలో పరిష్కారమయ్యే కేసులకు సంబంధించి బెయిల్ పిటీషన్ల విషయంలో సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం అనేది తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తూందని, బెయిల్ హక్కు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 క్రిందకు వస్తుందనే సూత్రం దీనికి మద్దతు ఇస్తుంది. ఇది జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. ట్రయల్ కోర్టులు బెయిల్ విషయంలో ఉదారత చూపకుండా వుంటే అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోందని ధర్మాసనం పేర్కొంటూ ట్రయల్ కోర్టుల్లో చిన్న చిన్న కేసుల్లో బెయిల్ మంజూరు చేయడం సుప్రీం కోర్టు వరకు వచ్చేందుకు తావివ్వక ఉదారతతో వ్యవహరించాలని తీర్పును వెలువరించింది.

# ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలి

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కి వినతి**

**పీలేరు మే 20 ప్రభాతవార్త :**

ఇంటర్మీడియట్ విద్యా శాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రమోటీ జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అసోసియేషన్ సభ్యులు సోమవారం అమరావతిలో మంత్రి నారా లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గురవయ్య మాట్లాడుతూ 1998, 1999, 2000, 2001 సంవత్సరాల్లో కామన్ సీనియారిటీ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం నుంచి స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్ ఇచ్చారని తెలిపారు. ఈ ప్రమోటీ జూనియర్ లెక్చరర్లు ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ ప్రకారం 2018 వరకు ప్రిన్సిపాల్ గానూ, డిగ్రీ కళాశాల లెక్చరర్లుగా పదోన్నతులు పొందారని అన్నారు. కాగా, ఎన్నికల నియమావళి అమలుకు ముందు 2024 మార్చ్ 15న ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ లిస్ట్‌లోని ప్రమోటీలను పక్కనపెట్టి జూనియర్లైన డైరెక్ట్ రిక్రూట్లకే ప్రిన్సిపాల్స్ ప్రమోషన్లు ఇవ్వడం అన్యాయమని చెప్పారు. అప్పట్లో 197 మందికి ప్రమోషన్లు దక్కగా, డిసెంబర్ 2024 నుండి మే 2025 మధ్య మరో 110 మంది డైరెక్ట్ రిక్రూట్లకు ప్రమోషన్ లభించిందని వివరించారు. మొత్తంగా 290 మందికి ప్రమోషన్లు కల్పిస్తూ డైరెక్ట్ రిక్రూట్లకే లబ్ధి చేకూరిందని తెలియజేశారు. ప్రస్తుతం జీఓ 302 అమల్లో ఉన్నప్పటికీ, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో అడ్వకేట్ జనరల్ ఇచ్చిన అసంబద్ధ నివేదిక ఆధారంగా ఒక వర్గానికి మాత్రమే లాభం చేకూర్చడం అన్యాయమన్నారు. ఒకే క్యాడర్లో 25 సంవత్సరాలకుపైగా సేవలందించిన వారిని పక్కన పెట్టడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. ప్రస్తుతం 210 మంది ప్రమోటీ జూనియర్ లెక్చరర్లు విధుల్లో ఉన్నారని, వీరిలో చాలామంది 2030 నాటికి పదవీ విరమణ పొందనున్నారని, 30 ఏళ్ళ అనుభవం ఉన్నవారు కూడా ఉద్యోగోన్నతులు పొందకుండా ఉద్యోగ విరమణ చేయను చేయడం బాధాకరమన్నారు. అందుకు, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని ఖాళీల్లో ఈ సీనియర్ ప్రమోటీలను ప్రిన్సిపాల్స్‌గా నియమిస్తే న్యాయం జరగవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. లేదంటే వీరి ఇంటర్మీడియట్ డిపార్ట్మెంట్ సేవలను ఆన్ డ్యూటీగా పరిగణించి స్కూల్ ఎడ్యుకేషన్‌లో సమాన స్థాయి పోస్టుల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి, ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీసీ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గురవయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ మురళీధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసి వినతి పత్రం ఇస్తున్న డీపీసీ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ నాయకులు

## రైతులతో సరుకును

# నగదుతో కొనుగోలు చేయాలి

**రైతులకు తప్పనిసరిగా బిల్లులు జారీ చేయాలి**

**జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఆజాద్ వల్లి**



చినకాయల కొనుగోలు విధానాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**పులివెందుల, మే 20,ప్రభాతవార్త:**

రైతులతో చీనికాయలును నగదు ఇచ్చే కొనుగోలు డబ్బు చేయాలి అని, రైతులకు తప్ప సరిగా బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మరియు మార్కెటింగ్ శాఖ అధికారి ఆజాద్ వల్లి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నందు చీని వ్యాపారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. రైతుల నుంచి ఎటువంటి సూటు తీసుకోకూడదని, ధరల బోర్డును ఏర్పాటు చేయాలని వారికి ఆదేశించారు. రైతులకు మేలు జరిగే విధంగా ప్రతి ఒక్క వ్యాపారి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బి శ్రీధర్ రెడ్డి, చీని వ్యాపారులు రమణారెడ్డి, సూరారెడ్డి , సాదక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

**నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు**



**రాయచోటి అర్బన్, మే 20 ప్రభాత వార్త**

రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా పదోన్నతులు,బదిలీల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నారని, బదిలీ లపై ప్రస్తుతం ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించి ఉపాధ్యాయ సంఘాలు కోరిన విధంగా వెంటనే ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు,బొనిగల హైమారావు,కడపజిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణమరాజులు డిమాండ్ చేశారు.మంగళవారం వారు విజయవాడలో పాఠశాల విద్యా కమిషనర్ కె.విజయ రామరాజును కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:45గా తీసుకోవాలని కోరగా 1:49 వరకు తీసుకునే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు.అలాగే బదిలీల షెడ్యూల్ గురించి కోరగా ఎస్జిటి లకు మాన్యువల్ కౌన్సెలింగ్ కు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అయితే ఆన్ లైన్ కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని, ఒకసారి ఆలోచించి చెప్పండని విద్యాశాఖ కమిషనర్ చెప్పినట్లు వారు తెలియజేశారు. అంతేగాక తెలుగు మీడియంను ప్రవేశ పెట్టాలని కోరగా మండలానికి ఒక తెలుగు మీడియం ఏర్పాటుకు ప్రయత్నం జరగవచ్చునని తెలిపారన్నారు.అలాగే ఏప్రిల్ 30 వరకు రేషనలైజేషన్ కట్ ఆఫ్ తేది పెట్టాలని కోరగా మార్చి 31 నాటికి విద్యార్థులు ఎక్కువ ఉన్నారని తెలపడం జరిగిందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో లాంగ్వేజ్ పండిట్ లు కొనసాగించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.అలాగే ఉన్నత పాఠశాలలో కాంపోజిట్ కోర్స్ ఉన్న పాఠశాలల్లో బాషోపాధ్యాయ పోస్టులను కొనసాగింపు హామీతో పాటు మరికొన్ని ముఖ్య విషయాలు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ తో ఉపాధ్యాయ సంఘాల చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటారని,బుధవారం దాదాపు బదిలీల షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉందని కమిషనర్ విజయరామరాజు తనను కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులకు సూచించారు.

# కార్మిక వర్గాన్ని కట్టు బానసలుగా చేసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

**జమ్మలమడుగు, మే 20, ప్రభాతవార్త:**

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ గౌరవాధ్యక్షుడు జి. ఏసుదాసు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం ఏవో నిజాముద్దీన్‌కు డీటీ రూపేష్‌కు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) పట్టణ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు వి.భాగ్యమ్మ, కె.లక్ష్మీదేవి, పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగన్న, శేఖర్‌లు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ మరియు మున్సిపల్ వర్కర్స్, ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ శానిటేషన్ వర్కర్ల బీసీ వెల్ఫేర్ వర్కర్స్ యూనియన్‌లలో పనిచేస్తున్న కార్మికులందరూ కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 4 లేబర్ కోడ్స్ వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచి అనేక మంది ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926, వర్క్ మెన్ కాంపిటీషన్ యాక్ట్ 1923 వేతనాల పెంపు చట్టం 1985తో సహా కనీస వేతన చట్టం 1948, బోనస్ గ్రాడ్యుటీ పీఎఫ్ ఈఎస్ఐ వాటి రూపంలో చట్టాలను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్‌గా మార్చేసిందని తెలిపారు. ఈ లేబర్ కోడ్స్ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించి ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఏజెన్సీలను అనుమతించకుండా కార్మికులందరినీ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని తెలిపారు. వయో పరిమితి 6ఏళ్లకు పెంచి రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసమే నిరసనలు, ర్యాలీలు నిర్వహించాలని మా రాష్ట్ర కమిటీ తీర్మానించింది. జులై 9వ తేదీ జరిగే దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమయం గడువులోపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం వాల్లించే 4 లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలలో జిల్లాలో పట్టణాలలో మండలంలో కార్మికుల చేత నిరసనలు వెలువెత్తుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు బి.లక్ష్మీదేవి, కె.కృపామని, ఎల్లమ్మ, గురుదేవి, వెంకటలక్ష్మి, సరస్వతి, హెల్పర్లు, సీఐటీయూ నాయకులు అబ్రహాం, రవి, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.



# లింగ వివక్ష అభివృద్ధికి అవరోధం

**చిట్వేలి, మే 20, ప్రభాతవార్త:**



బాలికల అభివృద్ధిలో లింగ వివక్ష అవరోధంగా మారిందని ఐసిడిఎస్ సిడిపిఓ నిర్మలా జ్యోతి అన్నారు. మంగళవారం కిషోరీ వికాసం వేసవి శిబిరం 6వ సెక్షన్లో భాగంగా లింగ వివక్ష వల్ల బాలికలకు ఎదురవుతున్న ఇబ్బందులు, చట్టరీత్యా అధిగమించేందుకు ఉన్న అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళ ఎదుగుతున్నప్పటికీ సమాజంలో చదువు,ఆరోగ్యం, ఆస్తి, ఉద్యోగ నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బాలికలకు కల్పిస్తున్న హక్కులను పాఠ్యాంశాలుగా చేర్చినప్పుడే అవగాహన ఏర్పడుతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు వసుంధరమ్మ, విశాలాక్షి, సురేఖా రాణి, మహిళా పోలీసు అమరావతి, ఏఎన్ఎం పద్మావతి, బోధన సిబ్బంది సుధామణి మరియు కిషోరీ బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రేమాలయ వృద్ధాశ్రమంలో అన్నదానం



**రామాపురం మే 20 ప్రభాతవార్త**

వీరబల్లి మండలం వొంగిమల్ల గ్రామానికి చెందిన మాదా పెద్ద రెడ్డప్పరెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె అనితారెడ్డి, అల్లుడు లక్ష్మి శేఖర్ రెడ్డి, మనుమడు యస్వంత్ రెడ్డి రామాపురం మండలం బండపల్లి వద్ద ఉన్న ప్రేమాలయ వృద్ధాశ్రమం లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వృద్ధులకు అన్నదానం నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు సందర్భం ఏదయినా కాని వృద్ధులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాలకొండ్రాయుడు సమాధి వద్ద నివాళులు

**సుండుపల్లి, మే 20, ప్రభాతవార్త:**

తెలుగుదేశం సీనియర్ నాయకుడు రాయచోటి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రాజంపేట పార్లమెంటరీ మాజీ ఎంపీ అయిన పాలకొండ్రాయుడు దశదిన కర్మకు హాజరై ఆయన సమాధి వద్ద నివాళులర్పించిన కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కుటుంబం ఒక మంచి రాజకీయవేత్తను కోల్పోయిందని మంచి పరిపాలన దక్షిత కలిగినటువంటి పాలకొండ్రా యుడు మనకు లేకపోవడం చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించాడు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి మండల ముడుంపాడు గ్రామం టిడిపి సీనియర్ నాయకుడు కంచన. రెడ్డెయ్య, తెలుగుదేశం కార్యకర్తలు, పెద్దాయన అభిమానులు ఆయన సమాధి వద్ద నివాలులు అర్పించినారు.



# నేడే కలికిరికి మాజీ సీఎం కిరణ్ రాక

**కలికిరి, మే 20, ప్రభాతవార్త:**

మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం కలికిరికి విచ్చేస్తున్నట్లు మాజీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప తెలిపారు. బుధవారం ఉదయం హైదరాబాదు నుంచి బయలుదేరి రేణిగుంట్ల విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి నేరుగా కేవీపల్లి మండలంలో జరగనున్న కార్యక్రమంలో పాల్గొని అనంతరం కలికిరికి చేరుకుంటారు. నేటి నుంచి ఆదివారం వరకు పలు కార్యక్రమాల్లో మాజీ సీఎం పాల్గొంటారన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాదుకు బయలుదేరి వెళ్తారు.

# అంగరంగ వైభవంగా మారెమ్మ జాతర

**రామసముద్రం మే 20 ప్రభాతవార్త**

మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమల రెడ్డి పల్లె గ్రామంలో వెలిసియున్న అతి పురాతన మారేమ్మ జాతర కనులు పండువగా నిర్వహించారు. ఈ జాతర మంగళవారం సాయంత్రం కనులు పండువగా సాగింది.ప్రతి ఇంటా పచ్చని తోరణాలు ప్రతి ఇంటిముందర రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆలయం దగ్గర అమ్మవారి ఫ్లెక్సీలు విద్యుత్ దీపాలతో కళకల లాడాయి. ఆరుగురు గ్రామ దేవతలకు మహిళలు ఒక్క పొద్దుతో బోనాలు, దీలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు తెచ్చిన పట్టుచీర, సారె, పసుపు కుంకుమలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి సమర్పించారు. తొలి పూజకు గ్రామ పెద్దలు, ప్రముఖులు గ్రామస్థులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా చిల్లర దుకాణాలు ఏర్పాట్లు చేశారు.కొనుగోలు దారులతో రోడ్డు రద్దీగా మారింది. చిన్నపిల్లల ఆటవస్తువులు భారీగా అమ్మకాలు జరిగాయి. అమ్మవారికి బెంగళూరు నుండి పలు రకాల పుష్పాలు తెచ్చి అమ్మవారిని అలంకరణ చేసి రథం పై పెట్టి పూజలు నిర్వహించారు.గ్రామదేవతకు జంతు బలి ఇచ్చి పురవీధుల్లో ఊరేగింపు చేశారు.మేళతాళాలు, బళ్లారి డ్రమ్ములు టపాసులు కాలుస్తూ అమ్మవారి ఊరేగింపు సాగింది. మహిళలు అమ్మవారికి హారతులు పట్టికొబ్బరికాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు. మండలంలోని ప్రజలు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి జాతరలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మారేమ్మ జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి. రవికుమార్ పోలీస్ సిబ్బంది బందోబస్తూ నిర్వహించారు.



# సొంత నిధులతో కల్వర్టుల నిర్మాణం

**9 వ డివిజన్ ఇంచార్జి బత్తల పవన్ కుమార్..**

**కడప కార్పొరేషన్, మే 20 ప్రభాతవార్త:**

కడప నగరం 9వ డివిజన్ ఎన్జీవో కాలనీలో సొంత నిధులు వెచ్చించి రెండు కలవట్ల దగ్గర నిర్మాణ పనులు చేసినట్లు 9వ డివిజన్ ఇంచార్జి, బిజెపి నాయకులు బత్తల పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కడప ఎన్జీవో కాలనీలో మీడియాతో పవన్ కుమార్ మాట్లాడుతూ 9వ డివిజన్ ఎన్జీవో కాలనీలో రెండు రోడ్లకు సంబంధించిన కల్వర్టు ల దగ్గర గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. టూవీలర్లు వాహనదారులు, పాదరక్షలు జారి పడిపోతున్నారన్నారు. పలుమార్లు సచివాలయ సిబ్బందికి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. 9వ డివిజన్ లో వైసిపి గెలుపొందిన ప్రయోజనం లేదన్నారు. కల్వర్టులు దెబ్బ తిన్నాయని, అధికారులు పట్టించుకోకపోవడంతో సొంత నిధులతో రెండు కలవట్ల దగ్గర పనులు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మునగా సతీష్, గౌరి శంకర్, బాలయ్య , పెరుగు శీను , గంగాధర్ , కృష్ణ రెడ్డి పాల్గొన్నారు.



# యురేనియం ప్రాంత ప్రజలకు న్యాయం చేస్తా

**నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి**

**పులివెందుల,మే20, ప్రభాత వార్త:**

యురేనియం ప్రాంత ప్రజలకు న్యాయం చేస్తానని ,ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు.వేముల మండలం కేకే కొట్టాల గ్రామం వద్ద ఉన్న టైలింగ్ పాండ్ ను పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ బీటెక్ రవి మంగళవారం సందర్శించారు. యూసిఐఎల్ అధికారులు టైలింగ్ పాండ్ ఎత్తును పెంచేందుకు ప్రయత్నిస్తు న్నారని అయితే ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించేంతవరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అలాగే అవసరమైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని కూడా ఇక్కడికి రప్పించేందుకు కృషి చేస్తామన్నారు. నష్టపరిహారం మరియు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పునరావాసం కల్పించాలని గట్టిగా పోరాడుతామన్నారు. టైలింగ్ పాండును వెంటనే పునర్ నిర్మించకపోతే యురేరియం కర్మాగారం మూతపడు తుందని టైలింగ్ పాండు ఎత్తును వెంటనే పెంచకపోతే వర్షం నీరు ఎక్కువ రావడంవల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతారని తెలిపారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా టైలింగ్ పాండ్ ను మరియు యురేనియం కర్మాగారాన్ని సందర్శిస్తారని తెలిపారు.

